క్లుప్తంగా

క్రిస్మస్ శుభాకాంక్షలు



పెనమలూరు: క్రిస్మస్ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు జన్మదినం పురస్కరించుకుని భక్తులు క్రిస్మస్ పండుగ ఘనంగా జరుపుకోవాలన్నారు. క్రిస్టియన్ సోదరులు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రపంచ శాంతికి ఏసుక్రీస్తు పిలుపునిచ్చారని, అందరూ క్రీస్తు ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.

బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు



పెనమలూరు: ఇటీవల హర్యానాలో జరిగిన సీబీఎస్ఈ సౌత్‌జోన్ జాతీయ స్థాయి పోటీలో ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో కానూరు స్కాట్ స్పైస్ విద్యార్థినులు బంగారు పతకాలు సాధించారు. అండర్–14 బాలికల విభాగంలో విద్యార్థినులు ఎ.శ్రీజ, ఎ.జేతశ్రీ, ఎం.ఇషితసింధులు ప్రతిభ చాటి బంగారు పతకాలు గెలిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వీరమాచినేని శాంతి, సీఈఓ జాహ్నవి, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ విద్యార్థులను అభినందించారు.

స్వామినాథుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని ప్రసిద్ధ దేవస్థానం చినకంచిలో స్వామినాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. చక్రధారణ, హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం తర్వాత శ్రీవల్లీ సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

మంతెనలో నిత్యావసరాలు పంపిణీ



కంకిపాడు: మండలంలోని మంతెన గ్రామంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా 70 మంది పేదలకు ఆదివారం నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేశారు. ముగ్గురు పేదలకు రూ. 15 వేలు సాయం అందించారు. ఈ సందర్భంగా దాత కొండవీటి వెంకటసుబ్బారావు మాట్లాడుతూ ప్రతీ కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేడంకి బాబీ, వడ్లమాటి సునీల్, బంద్రపల్లి గగన్, ఉప్పలూరి శ్రీనివాసరావు, అభిషేలం, తిరువీధుల సామేలు, కూరపాటి స్వామియేలు తదితరులు పాల్గొన్నారు.

కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలి



విజయవాడకల్చరల్: కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలని కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు సూచించారు. వాగ్దేవీ కళాపీఠం, విజయవాడ కవన వేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. పూర్ణచందు మాట్లాడుతూ కవులు సమాజ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ద్విశతావధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ఆధునిక కవిత్వంలో వస్తున్న మార్పులు అంశంగా ప్రసంగించారు. వాగ్దేవీ కళాపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ గానుగుల యుగంధరా చార్య మాట్లాడుతూ సంస్థ ద్వారా వర్ధమాన కవులకు వేదిక కల్పిస్తున్నట్లు వివరించారు. తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జిల్లేపల్లి వేంకటచలపతిరావు వివిధ కవితా ప్రక్రియలు అంశంగా ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయ కవితా గానం చేశారు. కవులను నిర్వాహకులు సత్కరించారు.

జాతీయ రహదారి పనులకు మోక్షం

ఎట్టకేలకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పోరంకి చేపల కుండీల వద్ద రోడ్డు పనులు ప్రారంభించిన దృశ్యం

పెనమలూరు: అసంపూర్తిగా ఉన్న విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి(బందరు రోడ్డు) పనులు ఎట్టకేలకు ప్రారంభించారు. పోరంకి చేపల కుండీల వద్ద ఆగిపోయిన రహదారి నిర్మాణ పనులు ఎన్‌హెచ్ఐ ఆధ్వర్యంలో చేపట్టారు. వివరాల్లోకి వెళితే గత పది సంవత్సరాల క్రితం విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ పనులు జరిగాయి. కోర్టు వివాదంలో ఉన్న ప్రాంతాల్లో పరిహారం చెల్లించే విషయమై తలెత్తిన వివాదాల కారణంగా పలు ప్రాంతాల్లో రహదారి విస్తరణ పనులు జరగలేదు. పోరంకి చేపల కుండీల వద్ద కూడా వివాదం కారణంగా రహదారి విస్తరణ ఆగిపోయింది. ఇక్కడ అజ్జాతలపాడు చెరువు కట్టపై పేదలు అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేసుకుని దాదాపు 25 ఏళ్లుగా జీవించారు. అయితే రహదారి విస్తరణ సమయంలో వారు పరిహారం కోరగా ప్రభుత్వ భూమి కావడంతో పరిహారం చెల్లింపుపై వివాదం తలెత్తింది. దీంతో పరిహారం చెల్లింపు జరగక రహదారి విస్తరణ పనులు చేయలేదు.

ప్రభుత్వ సహకారంతో..

కాగా బాధితులు తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని కోరారు. దీంతో ఆయన రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. నివాసాలు తొలగిస్తే పరిహారం ఇవ్వాలని అధికారులకు చెప్పడంతో రెవెన్యూ అధికారులు ఎన్‌హెచ్ఐ అధికారులను సంప్రదించి ఎట్టకేలకు బాధితులకు పరిహారం చెల్లించారు. అంతేకాకుండా బాధితులకు జగనన్న కాలనీలో స్థలం కూడా మంజూరు చేశారు. ఫలితంగా బాధితులు తమ నివాసాలు ఖాళీ చేయడానికి ముందుకు రావడంతో గత రెండు నెలల క్రితం రెవెన్యూ అధికారులు రోడ్డుకు అడ్డుగా ఉన్న నివాసాలు తొలగించారు. దీంతో పోరంకి చేపల కుండీల వద్ద అసంపూర్తిగా ఉన్న దాదాపు 150 మీటర్ల జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభించారు. నెల రోజుల్లో ఇక్కడ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయనున్నారు.

ఘనంగా తిరువీధి ఉత్సవం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ప్రధాన రహదారుల్లో స్వామివారి తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారి ఊరేగింపు జరిగింది. తిరువీధి ఉత్సవంలో మహిళా భక్తుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టీ తవ్వా పూర్ణచంద్రరావు, మాజీ సర్పంచ్ కాకాని అరుణ పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలి



కానూరులో పార్టీ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: కంకిపాడులో ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు ప్రాంత నేతలతో ఎమ్మెల్యే పార్థసారథి ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలు బాగుపడాలంటే వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌ను సీఎంని చేసుకోవాలని పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వం పేదలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడానికే సామాజిక సాధికార యాత్ర నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, నేతలు చాంద్‌బాషా, సిద్దిక్, వేమూరి బాలకృష్ణ, వల్లభనేని మణికంఠ, పఠాన్‌అహ్మద్, నేరెళ్ల బుజ్జి, సైకం చినబాబు, రవి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గ్రామ సచివాలయాల్లో 'ఆడుదాం ఆంధ్రా'

ఉంగుటూరు: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో మ్యాప్ చేసిన గ్రౌండ్‌లో 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను మంగళవారం నిర్వహించాలని ఎంపీడీఓ శేషగిరిరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పోటీలు జరిగే ప్రదేశంలో పారిశుద్ధ్యం, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఫలితాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయడంతోపాటు రిజిస్టర్‌లో కూడా నమోదు చేయాలని తెలిపారు. ఆటల పోటీలు పారదర్శకంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

నర్సింగ్ స్కూల్‌లో ఆరోగ్యంపై అవగాహన



మధురానగర్(విజయవాడసెంట్రల్): చేతులు తరచూ శుభ్రం చేసుకోవడంతో పాటు మాస్కులు ధరించాలని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం సూచించారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెల్లవారుజాము, రాత్రి పూట ప్రయాణాలు మానుకోవాలని తెలిపారు. బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు కిటికీ తలుపులు మూసుకోవాలని పేర్కొన్నారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ అల్లోపతి వైద్యులు డాక్టర్ ఆదిత్య చంద్రభట్ల ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు



విద్యుత్ దీపాల వెలుగులో గన్నవరం ఆర్‌సీఎం చర్చి

గన్నవరం: క్రిస్మస్ పండుగ సందర్భంగా గన్నవరం ప్రాంతంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. పట్టణంలోని బాలయేసు ఆర్‌సీఎం చర్చి, సీఎస్ఐ సెయింట్ పీటర్స్ టౌన్ చర్చి, ఎస్సీ కాలనీలోని సీఎస్ఐ చర్చి, పలు క్రైస్తవ దేవాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. చర్చిల వద్ద భారీ స్టార్స్, క్రిస్మస్ ట్రీలు, క్రీస్తు పుట్టుకకు గుర్తుగా ఏర్పాటు చేసిన పశువుల పాకలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పలు చర్చిల్లో క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ ప్రార్థనలు ప్రారంభించారు.



ముస్తాబైన గన్నవరం సీఎస్ఐ టౌన్ చర్చి

సర్వాంగ సుందరంగా చర్చిలు..

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చర్చిలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపకాంతులతో మెరిసిపోతున్నాయి. చర్చిల్లో అర్ధరాత్రి జరగనున్న ప్రత్యేక ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేశారు. క్రీస్తు జననానికి సూచనగా క్రైస్తవులు తమ ఇంటిపైన స్టార్లు ఏర్పాటు చేశారు. పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్‌తంబి పుణ్యక్షేత్రంలో చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించి, పశువుల పాక, క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేశారు.



విద్యుత్ దీపకాంతులతో తంబి పుణ్యక్షేత్రంలో చర్చి

యనమలకుదురులో సెమీ క్రిస్మస్ వేడుకలు

పెనమలూరు: యనమలకుదురులో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రియదర్శినినగర్‌లో ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పేదలకు చీరలు, స్వీట్లు పంపిణీ చేసి కేక్ కట్ చేశారు. అలాగే పిల్లలకు బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో నేతలు మరీదు శ్రీనివాసరావు, గుమ్మడి అన్వేష్, జక్కుల నిర్మల, రాజేష్, సుకుమార్, సతీష్ పాల్గొన్నారు.



యనమలకుదురులో చీరలు పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్

కంకిపాడులో..

కంకిపాడు: కంకిపాడు ఎస్టీయు కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఎస్టీయు ఆధ్వర్యంలోని వేడుకల్లో సంఘ ప్రతినిధులు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మండవ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పీకా ఇమ్మానుయేలు, ప్రతినిధులు అద్దేపల్లి విజయ్‌కుమార్, పచ్చిగళ్ల సురేష్‌బాబు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ..



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న అబ్రహాం

పాతపాడు(విజయవాడరూరల్): క్రిస్మస్ పండుగ సందర్భంగా పాతపాడు గ్రామంలో కలపాల అబ్రహాం ఆధ్వర్యాన ఆదివారం 60 మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ప్రతీ సంవత్సరం క్రిస్మస్ పండుగకి చీరలు పంపిణీ చేస్తున్నందున అబ్రహ్మం అతని కుమారులు కార్తీక్, కౌశిక్‌లకు మహిళలు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో కొమరవల్లి అనిల్, నల్లమోతు చిన్నబాబు, ముల్లంగి రాజు పాల్గొన్నారు.

జగనన్నతోనే ప్రజా సంక్షేమం సాధ్యం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి

కంకిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడు సచివాలయం–3 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి సంక్షేమ పథకాల బ్రోచర్లను అందించారు. వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ చేరేలా చర్యలు తీసుకుందని తెలిపారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజలకు గ్రామాల్లోనే మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవడం దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. సంక్షేమ పాలనపై ప్రతిపక్షాలు చేస్తున్న బురద రాజకీయాలను తిప్పికొట్టాలని, జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని వారు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాకీ రమణ, సీహెచ్‌సీ చైర్మన్ మేదంశ్రావు కుటుంబరావు, నాయకులు మలబంటి చిన్నమ్ములు, బి.దుర్గారావు, ఈఓ రామకృష్ణ, వీఆర్ఓ కె.ఏడుకొండలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా భావం అలవర్చుకోవాలి

జిల్లా ఎస్పీ జాషువా



అనాథ బాలలకు నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎస్పీ జాషువా దంపతులు

ఉయ్యూరు: ఏసుక్రీస్తు చూపిన సేవా భావం అలవర్చుకుని సమాజ అభ్యున్నతిలో భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ పీ జాషువా అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని సెయింట్ లూకాస్ అనాథ బాలల కేంద్రాన్ని ఆదివారం ఎస్పీ జాషువా దంపతులు సందర్శించారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని అనాథ బాలలతో కలిసి కేక్ కట్ చేశారు. ఎస్పీ దంపతులు కేక్ తినిపించి 41 మంది అనాథ బాలలకు నూతన వస్త్రాలను అందించారు. ఎస్పీ జాషువా మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, దయ, శాంతి, సహనం, కరుణ కలిగి ఉండాలన్నారు. ఈర్ష్యా, ద్వేషాలు విడనాడి తోటివారికి సాయం అందించడంలో ముందుండాలని సూచించారు. సమాజంలో అనాథలు, దివ్యాంగులకు చేయూత అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గన్నవరం డీఎస్పీ ఆర్జే జయసూర్య, ట్రైనీ డీఎస్పీ శ్రీవేద, కంకిపాడు సీఐ వీ శ్రీనివాసరావు, హనుమాన్‌జంక్షన్ సీఐ నవీన్ నరసింహమూర్తి, ఉయ్యూరు టౌన్ ఎస్ఐ వాసు, కేంద్ర నిర్వాహకుడు జోషి పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు నూకల వెంకట సాంబశివరావు, ఎండీ ఇస్మాయిల్, ప్రసాద్ ఎస్పీ జాషువా దంపతులు, డీఎస్పీ జయసూర్యలను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

జిల్లా ప్రజలందరికీ క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సుఖశాంతులు కలగాలని, అందరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలని కోరుతూ ఎస్పీ జాషువా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ



రైతు బజారులో వసతులపై వివరాలు తెలుసుకుంటున్న పడమట స్నిగ్ధ

కంకిపాడు: రైతుబజారుల్లో నాణ్యమైన కూరగాయలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ సూచించారు. కంకిపాడు, పటమట రైతుబజార్లను ఆదివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుబజారుల్లో వసతులపై ఆరా తీశారు. దుకాణదారులకు కల్పించిన వసతులు పరిశీలించారు. కూరగాయలు విక్రయాల ద్వారా లభిస్తున్న ఆదాయాన్ని అడిగి తెలుసుకుని, కూరగాయల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీసీఎంఎస్ ద్వారా నడుస్తున్న షాపుల్లోని దుకాణదారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. స్నిగ్ధ మాట్లాడుతూ కూరగాయల పంటలను సాగు చేసే రైతుల సంక్షేమం కోసం రైతుబజార్లను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. కొత్తగా జిల్లాలో పలు చోట్ల నూతన రైతుబజార్లను ప్రారంభించిందని తెలిపారు. దుకాణదారులు నాణ్యమైన కూరగాయలను కొనుగోలుదారులకు అందించాలని, రైతుబజార్ల ఏర్పాటు లక్ష్యాన్ని అధికమించడంలో ముఖ్య పాత్ర పోషించాలని పేర్కొన్నారు. దళారులకు దుకాణాలను కేటాయించకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా రైతుబజార్ల ఈఓలు చంద్రమోహన్, కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రామజన్మభూమి అక్షింతలకు ఘన స్వాగతం



అక్షింతల కలశాలకు స్వాగతం పలుకుతున్న భక్తులు

నున్న(విజయవాడరూరల్): అయోధ్య రామజన్మభూమి నుంచి వచ్చిన అక్షింతలుతో కూడిన కలశాలకు ఆదివారం నున్న గ్రామంలో భక్తులు ఘన స్వాగతం పలికారు. సమరసత సేవా ఫౌండేషన్(ఎస్ఎస్ఎఫ్) ప్రతినిధులు ఈ అక్షింతల కలశాలను ఎన్టీఆర్ జిల్లాకు తీసుకొచ్చారు. నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సమరసత సేవా ఫౌండేషన్ వారు గంగానమ్మ గుడి నుంచి శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో మహిళా భక్తులు కోలాటం ప్రదర్శించారు. శ్రీ వాసుదేవానందగిరి స్వామిజీ, అమిత్‌దేవ్ స్వామీజీల సమక్షంలో వెండి పళ్లెంలో అక్షింతలు కలిపారు. ఊరేగింపులో రూరల్ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ భీమవరపు శివరామిరెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ రావూరి రామారావు, ఆడిటర్ రామారావు, జ్యోతిష్య నిపుణుడు డాక్టర్ ఎం. ఫణికుమార్, యోగాచార్య పోలారెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెనమలూరులో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెనమలూరు: పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. వివిధ ప్రదేశాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన మిత్రులంతా తిరిగి బాల్యంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. 29 సంవత్సరాల తర్వాత 1994–1995 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అలనాటి మధుర స్మృతులు నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పూర్వ విద్యార్థులు ఐక్యమత్యంతో ఉండి కష్టాల్లో ఉన్న మిత్రులను ఆదుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కిరణ్మయి, రవి, సురేష్, కోటేశ్వరరావు, సునీల్, సుమన్, తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

• నగరంలో క్రిస్మస్ సందడి



బీసెంట్ రోడ్డులో కొనుగోలుదారుల రద్దీ

క్రిస్మస్ సందర్భంగా నగరంలోని అన్ని దుకాణాల్లో ఆదివారం రద్దీ నెలకొంది. ప్రధానంగా బీసెంట్ రోడ్డు, లెనిన్ సెంటర్‌లోని వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్లు కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, తేలప్రోలు గ్రామ కాపురస్తులు బిల్లంకొండ వెంకటేశ్వరరావు కుమారులు 1) బిల్లంకొండ శ్రీనివాసరావు, 2) బిల్లంకొండ రవికుమార్ లు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికీ తెలియజేయునది.

మా క్లయింట్లు వారి తండ్రి గారి వద్ద నుండి ది. 30-9-2023 గన్నవరం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నందు దస్తావేజు నెంబర్లు 9976/2023, 9977/2023 దఖలు దస్తావేజులు వ్రాయించుకొని ది. 22-12-2023న ఉంగుటూరు మండల తహశీల్దార్ ఆఫీసు నందు పట్టాదార్ పాస్ పుస్తకాలు మరియు రెవిన్యూ రికార్డులందు పేరు నమోదు కొరకు దరఖాస్తు చేసుకొని సాయంత్రం సుమారు 7 గం||ల సమయంలో సదరు ఎమ్.ఆర్.ఓ. ఆఫీసు ఉంగుటూరు నుండి తేలప్రోలు గ్రామమునకు వారి బండిపై వస్తుండగా దస్తావేజులు వున్న సంచి మార్గమధ్యలో జారిపోయిన విషయం ఇంటికి వెళ్ళిన తరువాత తెలియవచ్చినది. మార్గమధ్యలో ఉన్న నివాసితులను, ఇతరులను విచారించినప్పటికీ ఎటువంటి ఆచూకీ తెలియలేదు. కావున పై నెంబరు గల ఒరిజినల్ దస్తావేజులు ఎవ్వరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబర్లకు తెలియజేయగలరని వేడుకొనుచున్నారు.

గమనిక : సదరు ఒరిజినల్ దస్తావేజులు దొరికినవారు ఎటువంటి అన్యాక్రాంతములకు ఉపయోగించిన చెల్లవని అట్టివారిపై నా క్లయింట్లు చట్టపరమైన చర్యలు తీసుకొనగలరు.

బిల్లంకొండ శ్రీనివాసరావు, బిల్లంకొండ రవికుమార్
ఫోన్స్ : 70132 93614, 90032 86879

ఇట్లు,
టి. వెంకయ్య, బి.ఎ.బి.ఎల్., అడ్వకేట్,
సిందూర అర్కేడ్, ఫ్లాట్ నెం. 105, పంచాయితీ ఆఫీస్ రోడ్, గన్నవరం, కృష్ణాజిల్లా. ఫోన్స్ : 78895 68299, 93935 11338